తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
ఆదివారం
15 నవంబర్ 2026
పేజీలు : 08
Follow :

గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా

చర్యలు తీసుకోవాలి

■ అర్హులైన 497 మందికి కొత్త పింఛన్లు మంజూరు ■ అధికారులకు చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ఆదేశం

మొయినాబాద్, నవంబర్ 14 (జనంసాక్షి):

గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య సూచించారు. శనివారం మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో హిమబిందు అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో 19 అంశాలపై సమీక్ష నిర్వహించి, గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

నీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి

2027 జూన్ వరకు వర్షాలు తక్కువగా ఉండే అవకాశం ఉందన్న సమాచారంతో ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. ఎండిపోయిన బోర్లను పునరుద్ధరించాలని, నీటి ఎద్దడి ఉన్న గ్రామాల్లో అవసరమైతే రైతుల పొలాల నుంచి నీటిని తీసుకుని ప్రజలకు సరఫరా చేయాలని ఆదేశించారు. ఎల్గొండులో మూడు బోర్లు ఎండిపోవడంతో తాగునీటి సమస్య నెలకొందని సర్పంచ్ సభ దృష్టికి తీసుకువచ్చారు. రైతు బీమా పొందిన రైతు మరణిస్తే ఒకటి, రెండు రోజుల్లోనే అధికారులకు సమాచారం అందించాలని వ్యవసాయ అధికారి అనురాధారెడ్డి సూచించారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి

చందానగర్ రెవెన్యూ పరిధిలో గ్రామాల రెవెన్యూ నక్షలు అందించాలని పలుమార్లు కోరినా అధికారులు స్పందించడం లేదని సర్పంచ్ ముంటిగౌడ్ సభలో ప్రస్తావించారు. దీనిపై



ఎమ్మెల్యే అధికారులను ప్రశ్నిస్తూ రెవెన్యూ హద్దులను స్పష్టంగా గుర్తించి పంచాయతీ అధికారులకు వివరాలు అందించాలని ఆదేశించారు. మూసీ వాగు సమీపంలోని నిర్మాణాలు, 111 జీవో ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే మండలంలో అర్హులకు రేషన్ కార్డులు మంజూరు చేయడంలో జాప్యంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల్లో కుక్కల బెడద, ముఖ్యంగా ఎత్తుడ్వెల్లి గురుకుల పాఠశాల వద్ద విద్యార్థులకు ఎదురవుతున్న ఇబ్బందులను సర్పంచులు ప్రస్తావించారు.

497 మందికి కొత్త పింఛన్లు

మొయినాబాద్ మండలంలోని 19 గ్రామ పంచాయతీల పరిధిలో కొత్త పింఛన్ల కోసం 571 మంది దరఖాస్తు చేసుకోగా, 497 మందికి మంజూరయ్యాయి. శనివారం మండల రైతు వేదికలో ఎంపీడీవో హిమబిందు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య, లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ఈ నెల 19న ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా లబ్ధిదారుల ఖాతాల్లో పింఛన్ నగదు జమ చేయనున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అర్హులందరికీ పింఛన్లు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

ఈ కార్యక్రమాల్లో చేవెళ్ల ఆర్డీవో పార్థసింహారెడ్డి, మండల ప్రత్యేక అధికారి కిషన్‌రావు, ఎంపీడీవో హిమబిందు, ఎంసీవో విక్రాంత్‌రెడ్డి, రెవెన్యూ అధికారులు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు చింతకింది ప్రవీణ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మాడి రాజేందర్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, పింఛన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.




ఐదేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న రెనోవా సౌమ్య క్యాన్సర్ సెంటర్

లక్షకు పైగా ఓపీ సేవలు, 36 వేల కీమోథెరపీలు

లోపలి పేజీలో

అనుమతులు లేని '9 ఎడ్యుకేషన్' కళాశాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలి

- విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న యాజమాన్యం
- చర్యలు తీసుకోవడంలో ఇంటర్ విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం సిగ్గుచేటు
- ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరీష్, ఎండీ అన్వర్





రోడ్లపైనే వారాంతపు కూరగాయల సంతలు

■ ట్రాఫిక్ జామ్ తో వాహనదారులకు తిప్పలు

■ నాలుగేండ్లు గడిచిన షెడ్ల నిర్మాణం శిలాఫలకానికే పరిమితం

■ ప్రత్యేక స్థలం కేటాయించాలి విన్నపం ■ ఆదివారం జనం సాక్షి ప్రత్యేక కథనం

బొంరాస్ పేట, నవంబర్ 14 (జనం సాక్షి): ప్రతి ఆదివారం గ్రామాలలో రోడ్లపైనే కూరగాయల సంతలు కొనసాగుతూ ఉండడంతో ప్రయాణికులు, వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బొంరాస్ పేట మండల కేంద్రంతో పాటు తుంకిమెట్లలో ప్రతి ఆదివారం నిర్వహించే కూరగాయల సంత కోస్గి రోడ్డుకు జరుగుతుంది.ఒకపక్క హైదరాబాద్ బీజాపూర్ 163వ రహదారి ఇదే గ్రామం గుండా వెళ్లడంతో సంతకు వచ్చిన వాహనదారులు అడ్డగోలుగా ఎక్కడపడితే అక్కడ వాహనాలను పార్కింగ్ చేయడంతో భారీ వాహనాలు ట్రాఫిక్ లో చిక్కుకుంటున్నాయి. తుంకిమెట్లలో నిర్వహించే వారాంతపు కూరగాయల షెడ్ల నిర్మాణానికి సంబంధించి గత ప్రభుత్వ హయాములో వేసిన శిలాఫలకం నాలుగేళ్లయిన ఇప్పటికీ షెడ్ల నిర్మాణాన్ని చేపట్టేవారు కరువయ్యారు.ప్రభుత్వం మారిన మౌలిక సదుపాయాల కల్పన కోసం పట్టించుకునే వారు లేక వారాంతపు సంతలు ఆగమాగం అవుతున్నాయి. సంతకు వచ్చే ప్రజలకు త్రాగునీరు, మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. దుద్యాల మండల కేంద్రంతో పాటు పోలేపల్లి, లగచర్లలో జరిగే కూరగాయల సంతలో రోడ్లపైనే నిర్వహిస్తుండడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి ప్రత్యేక స్థలాలు కేటాయించి షెడ్ల నిర్మాణం చేపట్టాలని, మౌలిక వసతులు కల్పించి సమస్య పరిష్కారం దిశగా అడుగులు వేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

శేరిలింగంపల్లి జోన్ పరిధి ఇంజనీరింగ్ పనులపై జోనల్ కమిషనర్ సమీక్ష

శేరిలింగంపల్లి, నవంబర్ 14 (జనంసాక్షి) : శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ ఇంజనీరింగ్ (మెయింటెనెన్స్) విభాగపు పనుల పురోగతిపై శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శేరిలింగంపల్లి జోన్ ఎస్.ఈ, అన్ని సర్కిళ్ల ఈఈ లు, డిఈఈ లు, ఏఈలు మరియు ఇతర విభాగాల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు. జోన్ పరిధిలో జరుగుతున్న మోడల్ రోడ్లు, జంక్షన్ల అభివృద్ధి, క్రీడా ప్రాంగణాలు 'పర్క్ ఫ్రమ్ పార్క్' మరియు 'వన్ వార్డ్ ఎప్రీ డే' వంటి వివిధ అభివృద్ధి పనుల పురోగతిని జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ ఈ సమావేశంలో క్షుణ్ణంగా సమీక్షించారు. ఇందులో భాగంగా అధికారులకు జోనల్ కమిషనర్ కీలక ఆదేశాలు జారీ చేశారు. జోన్ పరిధిలోని ఆయా ప్రాంతాలలో పూర్తయిన అన్ని పనులకు సంబంధించిన ఎం.బి. రికార్డులను వెంటనే నమోదు చేయాలని సూచించారు. పనులు పూర్తయిన ప్రతి ప్రాంతంలో తప్పనిసరిగా 'వర్క్ కంప్లీషన్ బోర్డులు' ఏర్పాటు చేయడంతోపాటు ఆ పనులకు సంబంధించిన వీడియోలను చిత్రీకరించి పిఎంయుకు పంపాల్సిన బాధ్యతను వివరించారు. ఇంజనీరింగ్ పనులు కొనసాగుతున్న క్రమంలో వివిధ సమస్యలపై అందుతున్న ఫిర్యాదులతోపాటు సామాజిక మాధ్యమాలు, పత్రికలలో వచ్చే వ్యతిరేక వార్తలపట్ల అప్రమత్తతతో వ్యవహరించడంతోపాటు ప్రజావాణి ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని సత్వరమే పరిష్కరించాలని జోనల్ కమిషనర్ క్రింది స్థాయి అధికారులకు స్పష్టం చేశారు. చేపట్టే ప్రతి పనిలో నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని, ఫుట్‌పాత్‌లు, శ్మశాన వాటికలు, వివిధ ప్రధాన కూడళ్ళు, అంతర్గత జంక్షన్లు, ఫ్రీ-లెఫ్ట్‌ల ఏర్పాటుపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణను చేపడుతూనే నీరు నిలిచే ప్రాంతాలవల్ల ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులను పరిగణలోకి తీసుకొని వాటి పరిష్కారంవంటి ఐకానిక్ ప్రాజెక్టులను మరింత ఎక్కువ సంఖ్యలో చేపట్టాలని కోరారు. ఇటీవల మంజూరైన ఇంకుడు గుంతల పనులు మరియు విలీన ప్రాంతాల డ్రైనేజీ ప్యాకేజీ పనులను తక్షణమే క్షేత్రస్థాయిలో ప్రారంభించే అంశంపై సమావేశంలో చర్చించి వాటి అమలుకు తీసుకోవాల్సిన చర్యలను జోనల్ కమిషనర్ సంబంధిత విభాగాల అధికారులకు దిశా నిర్దేశం చేశారు.



బొటానికల్ గార్డెన్‌లో బాలల దినోత్సవ వేడుకలు

విద్యార్థులకు వక్తృత్వం, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు

హైదరాబాద్, నవంబర్ 14 (జనంసాక్షి): బాలల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతో పాటు ప్రకృతి, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే లక్ష్యంతో తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ (టీజీఎఫ్ డీసీ) ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. సంస్థకు చెందిన 'దెక్కన్ వుడ్స్ అండ్ ట్రైల్స్' ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఎకో టూరిజం) ఐఎఫ్ఎస్ అధికారి ఎల్. రంజిత్ నాయక్ మార్గదర్శకత్వంలో శనివారం కొండాపూర్‌లోని ఎస్‌కేవీబీఆర్ బొటానికల్ గార్డెన్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఖానామెట్‌లోని అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన 46 మంది విద్యార్థులకు వక్తృత్వం, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. వక్తృత్వ పోటీలో 'వన్యప్రాణులు, వాటి సంరక్షణపై ఎల్‌నినో ప్రభావం' అనే అంశంపై విద్యార్థులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఎల్‌నినో వంటి వాతావరణ పరిస్థితులు ప్రకృతి వ్యవస్థలు, వన్యప్రాణుల జీవన పరిస్థితులపై చూపే ప్రభావంతో పాటు వాటి సంరక్షణ ఆవశ్యకతను





వివరించారు. వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లోనూ తమ ఆలోచనలను రచనలు, చిత్రాల ద్వారా వ్యక్తం చేశారు.వేడుకల్లో భాగంగా ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్ సొసైటీ సభ్యులు పాములపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రకృతి సమతుల్యతలో పాముల పాత్ర, వాటి సంరక్షణ ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎకో టూరిజం అసిస్టెంట్ డైరెక్టర్ శిరిష, ప్లాంటేషన్ మేనేజర్ వి. లక్ష్మారెడ్డి, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కె. శ్రీనివాసులు రెడ్డి, వృక్షశాస్త్ర నిపుణుడు డాక్టర్ ఐ. వీర కిషోర్ పాల్గొన్నారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు శిరిష బహుమతులు అందజేశారు. చిన్నతనం నుంచే పిల్లల్లో ప్రకృతిపై ఆసక్తి పెంపొందించడం, జీవవైవిధ్యం, వన్యప్రాణుల ప్రాధాన్యతను తెలియజేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో యువత భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడమే ఇటువంటి కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమని టీజీఎఫ్ డీసీ పేర్కొంది.

అంబరాన్నంటిన 'తారే జమీన్ పర్' సంబరం

రౌండ్ టేబుల్ ఇండియా ఆధ్వర్యంలో ఘనంగా వేడుక
మూడు వేల మంది దివ్యాంగ చిన్నారుల సందడి



హైదరాబాద్ నవంబర్ 14 (జనంసాక్షి): ప్రతిభ, సృజనాత్మకత, ఆనందం, కలుపుగోలుతనానికి ప్రతీకగా రౌండ్ టేబుల్ ఇండియా – ఏరియా 9 'తారే జమీన్ పర్' వేడుకను నిర్వహించింది. నగరంలో జరిగిన అతిపెద్ద, అత్యంత హృదయపూర్వక పెయింటింగ్ పోటీల వేడుకలలో ఒకటైన ఈ కార్యక్రమానికి మూడు వేల మందికి పైగా ప్రత్యేక అవసరాలు గల (దివ్యాంగ) చిన్నారులు ఒకే వేదికపైకి వచ్చారు. హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటెలెక్చువల్ డిజేబిలిటీస్ వేదికగా జరిగిన ఈ కార్యక్రమం ఆ ప్రాంగణాన్ని రంగులు, నవ్వులు, సంగీతం, ఆనందంతో కూడిన ఒక అద్భుతమైన కాన్వాస్‌గా మార్చింది. చిన్నారులు తమ ఊహాశక్తిని వ్యక్తపరచడానికి, ప్రతిభను ప్రదర్శించడానికి, తమ ప్రత్యేకతను చాటుకోవడానికి ఈ వేడుక ఒక చక్కటి వేదికను అందించింది. ఈ వేడుకకు తెలుగు చలనచిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖులు విచ్చేశారు. నటుడు సాయి దుర్గ తేజ్, నటి ఈషా రెబ్బా, ప్రముఖ చలనచిత్ర నిర్మాత సూర్యదేవర నాగవంశీ, నటి అషు రెడ్డి హాజరయ్యారు.

చీర్యాల ఆలయంలో వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన

చీర్యాల, నవంబర్ 14 (జనంసాక్షి): చీర్యాల శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా ప్రారంభమైంది. ఆలయంలో ఆండాళ్ అమ్మవారు, రామానుజులు, మనవాళ మహాముని, నమ్మాళ్వార్, గజ విగ్రహాలతో పాటు పుష్కరిణిలో జల లక్ష్మీనారాయణ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఆలయ ఫౌండర్, చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో యాదాద్రి రిటైర్డ్ ప్రధాన అర్చకులు నల్లందిగుల్ నరసింహాచార్యులు వేదమంత్రోచ్ఛారణల నడుమ కార్యక్రమాలను ప్రారంభించారు.



నవీన్ మిట్టల్‌కు పూర్ణకుంభ స్వాగతం

విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ స్పెషల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఫౌండర్, చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ వేద పండితులతో కలిసి ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం కళ్యాణ మండపంలో శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేసి వేద ఆశీర్వచనం చేశారు.

స్వామివారిని దర్శించుకున్న కూన శ్రీశైలం గౌడ్

కార్తీక మాసం సందర్భంగా కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ వేద పండితులతో కలిసి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శనానంతరం

కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు.. సత్యనారాయణ స్వామి వ్రతాలు
నవీన్ మిట్టల్, కూన శ్రీశైలం గౌడ్ స్వామివారి దర్శనం



శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేసి వేద ఆశీర్వచనం చేశారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ స్వామి వ్రతాలు

ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా శ్రీ రమాసహిత సత్యనారాయణ స్వామి వ్రతాలను ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వ్రతాలు ఆచరించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని సప్తవృక్షాలు, నాగదేవత వద్ద కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఫౌండర్, చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరి, వేద పండితులు, భక్తులు పాల్గొన్నారు.







జనంసాక్షి

అనుమతులు లేని '9 ఎడ్యుకేషన్' కళాశాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలి

- **విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న యాజమాన్యం**
- **చర్యలు తీసుకోవడంలో ఇంటర్ విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం సిగ్గుచేటు**
- **ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరీష్, ఎండీ అన్వర్**

బోడుప్పల్-జనంసాక్షి : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, మేడిపల్లి మండలం, బోడుప్పల్ సర్కిల్ పరిధిలో ప్రభుత్వ అనుమతులు లేకుండా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న '9 ఎడ్యుకేషన్' కళాశాల యాజమాన్యంపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరీష్, ఎండీ అన్వర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కళాశాల ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టే విధంగా వ్యవహరిస్తున్న విద్యాసంస్థలపై అధికారులు తక్షణమే స్పందించాలని వారు కోరారు.

ఈ సందర్భంగా హరీష్, ఎండీ అన్వర్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా కొన్ని ప్రైవేట్ ఇంటర్మీడియట్ కళాశాలలు ఇంటర్మీడియట్ బోర్డు అనుమతులు లేకుండానే, ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా విద్యార్థులను చేర్చుకుంటున్నాయని ఆరోపించారు. విద్యను వ్యాపారంగా మార్చుకుని, విద్యార్థుల భవిష్యత్తుతో పాటు తల్లిదండ్రుల ఆశలను కూడా దెబ్బతీస్తున్న ఇలాంటి యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని 9 ఎడ్యుకేషన్ కళాశాలకు ప్రభుత్వ గుర్తింపు, అనుమతులు లేవని ఆరోపిస్తూ, అయినప్పటికీ విద్యార్థులను చేర్చుకుని వారి నుంచి అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తూ తరగతులు నిర్వహిస్తున్నారని విమర్శించారు.

విద్యార్థులు ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించే సమయంలో కళాశాల గుర్తింపు, బోర్డు అనుమతులు అత్యంత కీలకమని వారు పేర్కొన్నారు. అనుమతులు లేని కళాశాలల్లో చదివే విద్యార్థుల విద్యా భవిష్యత్తు, పరీక్షలకు సంబంధించిన అవకాశాలు, తదుపరి ఉన్నత విద్యలో ప్రవేశాల విషయంలో సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం కష్టపడి సంపాదించిన డబ్బును ఫీజుల రూపంలో చెల్లిస్తుంటే, ఆయా విద్యాసంస్థలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కళాశాలలు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వచ్చినప్పుడు వాటిని తనిఖీ చేసి వాస్తవాలను నిర్ధారించాల్సిన బాధ్యత ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులపై ఉందన్నారు. అయితే, ఇలాంటి వ్యవహారాలపై అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోకుండా కాలయాపన చేయడం సిగ్గుచేటని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తు కంటే ప్రైవేట్ విద్యాసంస్థల ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నారా అనే అనుమానాలు ప్రజల్లో కలుగుతున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు స్పందించి 9 ఎడ్యుకేషన్ కళాశాలలో తక్షణమే తనిఖీలు నిర్వహించాలని, కళాశాల అనుమతులు, గుర్తింపు, ఫీజుల వసూళ్లు, తరగతుల నిర్వహణపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. నిబంధనల ఉల్లంఘనలు నిర్ధారణ అయితే కళాశాల యాజమాన్యంపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఎలాంటి నష్టం కలగకుండా తగిన చర్యలు చేపట్టి, విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని స్పష్టం చేశారు. విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి తక్షణమే స్పందించకపోతే విద్యార్థుల పక్షాన ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణ, మేడిపల్లి మండల కార్యదర్శి శ్రీకాంత్, జిల్లా నాయకులు భరణి, సాయి, సోహెల్, నరేందర్, సిద్ధు,గౌతమ్ పాల్గొన్నారు.



ఐదేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న రెనోవా సౌమ్య క్యాన్సర్ సెంటర్

లక్షకు పైగా ఓపీ సేవలు, 36 వేల కీమోథెరపీలు

ముషీరాబాద్, నవంబర్ 14 (జనం సాక్షి):

రెనోవా సౌమ్య క్యాన్సర్ సెంటర్ క్యాన్సర్ చికిత్సలో ఐదేళ్ల విజయవంతమైన ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంది. 2021లో ప్రారంభమైన ఈ కేంద్రం ఇప్పటివరకు లక్షకు పైగా ఓపీ సేవలు, 45 వేల ఇన్‌పేషెంట్ అడ్మిషన్లు, 36 వేల కీమోథెరపీలు, 3 వేల రేడియేషన్ చికిత్సలు అందించి అరుదైన మైలురాయిని సాధించింది. ఈ మేరకు శనివారం కార్ఖానాలోని రెనోవా సౌమ్య క్యాన్సర్ సెంటర్ లో ఐదో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు రెనోవా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ వ్యవస్థాపకులు, సీఈఓ శ్రీధర్ పెద్దిరెడ్డి, చీఫ్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ సి.ఎస్. రావు, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఇందివర్ కిరణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీధర్ పెద్దిరెడ్డి మాట్లాడుతూ నాణ్యమైన క్యాన్సర్ వైద్యాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యమని తెలిపారు. ఆధునిక వైద్య సాంకేతికత, నైతిక విలువలు, బహుళ విభాగాల సమన్వయంతో రోగులకు మెరుగైన చికిత్స అందిస్తున్నామని పేర్కొన్నారు. ఐదేళ్ల ప్రస్థానంలో రోగులు తమపై ఉంచిన విశ్వాసమే ఈ విజయానికి ప్రధాన కారణమన్నారు. రెనోవా గ్రూప్ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్, యూనిట్ హెడ్ జనార్ధన్ నందిగాం మాట్లాడుతూ రోగులు, వారి కుటుంబ సభ్యుల నమ్మకమే తమకు స్ఫూర్తి అని తెలిపారు. ఈ విజయానికి కృషి చేసిన వైద్యులు, నర్సులు, సాంకేతిక, ఇతర సిబ్బందిని యాజమాన్యం అభినందించింది. ఆరో సంవత్సరంలోకి అడుగుపెడుతున్న కేంద్రం మరింత మెరుగైన క్యాన్సర్ వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తుందని వెల్లడించింది.



అల్వాల్‌లో బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టులు

అల్వాల్, నవంబర్ 14 (జనంసాక్షి): హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న 'యాంటీ భారత్ సమ్మిట్'కు, రాహుల్‌గాంధీ పర్యటన కు వ్యతిరేకంగా నిరసన తెలిపేందుకు సిద్ధమైన అల్వాల్ బీజేపీ నాయకులను పోలీ సులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడు తూ.. ఆరు గ్యారంటీలతో పాటు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. శాంతియుతంగా నిరసన తెలిపే ప్రజాస్వామ్య హక్కును అడ్డుకుంటూ అరెస్టులకు పాల్పడటం అన్యాయమన్నారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం గురించి మాట్లాడే కాంగ్రెస్ పార్టీ, తెలంగాణలో ప్రతిపక్ష నేతలను అరెస్టు చేయడం ద్వారా రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తో ందని విమర్శించారు. కాంగ్రెస్ నిర్వహిస్తు న్నది 'భారత్ సమ్మిట్' కాదని, 'యాంటీ భారత్ సమ్మిట్' అని వ్యాఖ్యానించారు. ముందస్తు అరెస్టయిన వారిలో బీజేపీ నాయ కులు మోయి సుజాత, మల్లికార్జున్ గౌడ్, అజయ్ రెడ్డి, గోపి, అజిత్, పద్మిని ఉన్నారు.



రాహుల్ పర్యటనను నిరసిస్తూ భాజపా ఆందోళన

అల్వాల్, నవంబర్ 14 (జనంసాక్షి): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ రాష్ట్ర పర్యటనను నిరసిస్తూ భాజపా శ్రేణులు అల్వాల్ అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన చేపట్టాయి. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు పిలుపు మేరకు, మేడ్చల్-మల్కాజిగిరి అర్బన్ జిల్లా అధ్యక్షుడు గిరివర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని నేతలు మండిపడ్డారు. నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, ప్రాజెక్టుల నిర్మాణం, జీహెచ్‌ఎంసీ విభజనపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షులు రుత్విక్, శ్రీకాంత్‌యాదవ్, శ్రీధర్‌రెడ్డి, ఉదయప్రకాష్, ఉష, మనీష్, విశ్వేశ్వర్, వేణురాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం ప్రభుత్వ పాఠశాలల్లో గ్రంథాలయాలు ప్రారంభం

చేవెళ్ల, నవంబర్ 14 (జనంసాక్షి) : బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని చేవెళ్ల మండల పరిధిలోని రావులపల్లి, కౌకుంట్ల, ఈర్లపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నూతన గ్రంథాలయాలను ప్రారంభించారు. రావులపల్లి పాఠశాలలో సర్పంచ్ గోటూరి రాంచంద్రయ్య గౌడ్ అధ్యక్షతన బాలసభ నిర్వహించి చిన్నారుల సమస్యలు తెలుసుకుంటూనే గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈర్లపల్లి పాఠశాలలో సర్పంచ్ లావణ్య రాజశేఖర్ గ్రంథాలయాన్ని ప్రారంభించగా, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కౌకుంట్ల గ్రామంలో సర్పంచ్ మల్లారెడ్డి పాల్గొని గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో రావులపల్లి ఉప సర్పంచ్ అనూష అంజన్ కుమార్, పంచాయతీ కార్యదర్శి కె.లింగం, ఈర్లపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు, వార్డు సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హోప్ ఆధ్వర్యంలో ఘనంగా బాలల దినోత్సవం

శేరిలింగంపల్లి, నవంబర్ 14 (జనంసాక్షి) : శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ సర్కిల్ చందానగర్ ప్రభుత్వ పాఠశాలలో జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ కుమార్ పాఠశాలలో ఏర్పాటు చేసిన వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరై దేశ మాజీ ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలనువేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని బలంగా నమ్మిన జవహర్ లాల్ నెహ్రూ బాలల సంక్షేమం కోసం, ఉజ్వల భవిష్యత్తు కోసం ఆనాడే ఎన్నో ప్రత్యేక సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టి అమలు చేయడం జరిగిందన్నారు. చిన్నపిల్లల పట్ల ఎనలేని ప్రేమాభిమానాలు కనబరిచే జవహర్ లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని భారత ప్రభుత్వం నవంబర్ 14 ను జాతీయ బాలల దినోత్సవం గా ప్రకటించడం జరిగిందన్నారు. చిన్నతనంలో సమాజం పట్ల, తల్లిదండ్రుల పట్ల, పెద్దల విషయంలో సత్ప్రవర్తనను కలిగి ఉండేలా పిల్లలను ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని, తద్వారా రేపటి సమాజం మరింత మెరుగైన భారత దేశ అభివృద్ధికి దోహదపడుతుందని కొండా విజయ్ కుమార్ అభిప్రాయపడ్డారు. పిల్లలు తమ తల్లిదండ్రుల స్థితిగతులను గమనంలో ఉంచుకొని క్రమశిక్షణతో ఎదుగుతూ ఉన్నత చదువులు చదవడం ద్వారా మంచి భవిష్యత్తుకు పునాదిని నిర్మించుకోవాలని, ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను, జీవిత పాఠాలను శ్రద్ధగా విని బంగారు భవిష్యత్తుకు బాటలు పరుచుకోవాలని సూచించారు. బాలల దినోత్సవం నేపథ్యంలో పాఠశాల విద్యార్థులకు, చిన్నారులకు స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుభాష్, భీమమ్మ, విజయలక్ష్మి, ప్రీతి, కవిత, రాధిక పాల్గొన్నారు.



బాలికల పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

విద్యార్థులకు బహుమతులు అందజేసిన మున్సిపల్ చైర్మన్ సమత వెంకట్ రెడ్డి



చేవెళ్ల, నవంబర్ 14 (జనంసాక్షి): చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలోని బాలికల ప్రాథమిక ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సమతావెంకట్ రెడ్డి, వైస్ చైర్మన్ రాము గౌడ్, కౌన్సిలర్ బండారి శైలజాఆగి రెడ్డి, మద్దెల శ్రీనివాస్, కృష్ణ నాయక్ పాల్గొన్నారు. ఇటీవల రవీంద్ర భారతిలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఈ సందర్భంగా బహుమతులు అందజేశారు. విద్యార్థులను అభినందించి వారి ప్రతిభను ప్రశంసించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, వాటిని సాధించి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. చదువుతో పాటు సాంస్కృతిక, క్రీడా రంగాల్లోనూ ప్రతిభను చాటాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి

జవహర్ నగర్ బీజేపీ నూతన కార్యవర్గం నియామకం

కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి: జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్



జవహర్ నగర్: నవంబర్ 14 (జనంసాక్షి): జవహర్ నగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కళికోట కమలాకర్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో డివిజన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి పేదవాడికి చేరేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని సూచించారు. అనంతరం జవహర్ నగర్ డివిజన్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు.ఉపాధ్యక్షులు: బొమ్మ యాదగిరి, మధ్యబోయిన రాజు, ముచ్చర్ల యాదగిరి. ప్రధాన కార్యదర్శులు: ఆదిమూలం రాఘవ, పుల్లూరి అనిల్ కుమార్. కోశాధికారి కోమాకుల రాజు. యువ మోర్చా శాగ అనిల్. మహిళా మోర్చా ఇంద్రపాల భవాని. ఓబీసీ మోర్చా తేలు శ్రీనివాస్. దళిత మోర్చా రామంచ క్రాంతి. గిరిజన మోర్చా లావుడ్యా రాంలాల్ నాయక్ కిసాన్ మోర్చా సాదరమైన రవి ముదిరాజ్. ఎండోమెంట్ సెల్ కన్వీనర్ దుస్స లక్ష్మీనారాయణ. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షుడు కళికోట కమలాకర్ మాట్లాడుతూ, నూతనంగా నియమితులైన నాయకులంతా సమష్టిగా పనిచేస్తూ ప్రతి బూత్‌లో పార్టీని బలోపేతం చేయాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.
ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు, మహిళా నాయకులు, యువ మోర్చా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కాప్రా డివిజన్‌లో అభివృద్ధి పనులకు ప్రారంభించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కాప్రా, నవంబర్ 14 (జనం సాక్షి): కాప్రా డివిజన్ పరిధిలో పలు కాలనీలలో రూ 3 కోట్ల పదిలక్షల వ్యయంతో పలు అభివృద్ధి పనులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, ఉప్పల్ నియోజకవర్గంలోని ప్రతి కాలనీకి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటికి శాశ్వత పరిష్కారాలు చూపే దిశగా అభివృద్ధి పనులను చేపడుతున్నామని పేర్కొన్నారు. నిధులను సద్వినియోగం చేసుకుంటూ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అభివృద్ధి పనుల విషయంలో ఎక్కడా రాజీ పడకుండా ప్రజలకు మెరుగైన వసతులు అందించేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఇంద్రయ్య,బదురుద్దీన్, మహేష్, మురళి పంతులు, గిల్బర్ట్, భాస్కర్ గౌడ్,నవీన్ గౌడ్ పార్టీ నాయకులు బైరీ నవీన్ గౌడ్ ,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



జవహర్ నగర్ బీజేవైఎం అధ్యక్షుడిగా శాగ అనిల్ కుమార్ నియామకం

పార్టీ అభివృద్ధికి కృషి చేస్తా: శాగ అనిల్ కుమార్

జవహర్ నగర్: నవంబర్ 14 (జనంసాక్షి): భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) జవహర్ నగర్ డివిజన్ అధ్యక్షుడిగా శాగ అనిల్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, జవహర్ నగర్ బీజేపీ అధ్యక్షుడు కమల్ సమక్షంలో అనిల్ కుమార్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శాగ అనిల్ కుమార్ తన నియామకంపై హర్షం వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని, పార్టీకి విధేయుడిగా ఉంటూ బీజేపీ బలోపేతానికి, యువతను పార్టీ వైపు ఆకర్షించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. నూతనంగా నియమితులైన శాగ అనిల్ కుమార్‌కు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మిత్రులు అభినందనలు తెలియజేసి శుభాకాంక్షలు తెలిపారు.



సీసీ కెమెరాల ఏర్పాటు, నేరాల నియంత్రణపై అవగాహన

చేవెళ్ల, నవంబర్ 14 (జనంసాక్షి) : చేవెళ్ల మండల పరిధిలోని కౌకుంట్ల గ్రామంలో సర్పంచ్ బార్లపల్లి మల్లారెడ్డి అధ్యక్షతన నేరాల నియంత్రణ మరియు సీసీ కెమెరాల ఏర్పాటుపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చేవెళ్ల ఎస్ఐ కోటేశ్వర్ రావు హాజరై మాట్లాడుతూ.. గ్రామాల్లో నేరాల నియంత్రణకు, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడానికి సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ తమ వ్యాపార కేంద్రాల వద్ద, కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సర్పంచ్ మల్లారెడ్డి మాట్లాడుతూ.. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుంటూనే శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గ్రామస్తుల భద్రత కోసం ప్రభుత్వ సహకారంతో పాటు గ్రామస్తుల భాగస్వామ్యంతో మరిన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అరుంధతి నగర్ మెయిన్ రోడ్డులో వేలాడుతున్న విద్యుత్ తీగలు

వెంటనే కొత్త స్తంభం ఏర్పాటు చేయాలి

విద్యుత్ శాఖ ఈఈకి బీఆర్ఎస్ యువజన అధ్యక్షుడు కె. విక్రమ్ వినతి



జవహర్ నగర్: నవంబర్ 14 (జనంసాక్షి): చంద్రపురి డివిజన్ పరిధిలోని సీఆర్‌పీఎఫ్ అరుంధతి నగర్ మెయిన్ రోడ్డులో ఒరిగిపోయిన విద్యుత్ స్తంభం స్థానికులను భయాందోళనకు గురిచేస్తోంది. ఏ క్షణంలోనైనా కూలిపోయే ప్రమాదం ఉండటంతో పాటు, విద్యుత్ తీగలు కిందికి వేలాడుతుండటంతో ప్రమాదం పొంచి ఉంది. ఈ నేపథ్యంలో వెంటనే పాత స్తంభాన్ని తొలగించి కొత్తది ఏర్పాటు చేయాలని కోరుతూ బీఆర్ఎస్ యువజన అధ్యక్షుడు కె. విక్రమ్, కాలనీ వాసులతో కలిసి విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు వినతిపత్రం సమర్పించారు. కొన్ని రోజుల క్రితం మెయిన్ రోడ్డులో జరుగుతున్న పనుల సమయంలో డోజర్ తగలడంతో విద్యుత్ స్తంభం ఒకవైపునకు ఒరిగిపోయిందని స్థానికులు తెలిపారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిపై వాహనదారులు, పాదచారులు, పాఠశాల విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారని, వేలాడుతున్న విద్యుత్ తీగల వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేశారు.

నెహ్రూ గొప్ప దేశ భక్తుడు : ఆష్జల్ ఖాన్



శామీర్ పేట్, నవంబర్ 14(జనం సాక్షి): జవహర్ లాల్ నెహ్రూ గొప్ప దేశభక్తుడని అష్జల్ ఖాన్ అన్నారు. శనివారం శామీర్ పేట్ లో చిల్డ్రన్ డే సందర్భంగా మాతృ శ్రీ అనాద ఆశ్రమంలో సీనియర్ ఉద్యమ కారులు, కాంగ్రెస్ నాయకులు మహ్మద్ అష్జల్ ఖాన్ పండ్లు పంపిణీ చేశారు. జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అష్జల్ ఖాన్ దేశ ప్రధానిగా నెహ్రూ చేసిన సేవలను కొనియాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక భూమిక వహించారని అష్జల్ ఖాన్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో అష్జల్ ఖాన్ తో పాటు నాయకులు, ఉపా ధ్యాయులు పి నర్సింహా రెడ్డి, మాతృ శ్రీ ఆశ్రమం ఫౌండర్ నర్సింహా, ఆశ్రమ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కనిపించకుండా పోయిన యువకుడి ఆచూకీ తెలపండి

నరేష్ ఆచూకీ తెలిపిన వారికి తగిన పారితోషికం



యాచారం , నవంబర్ 14(జనం సాక్షి) : యాచారం మండలం గడ్డమల్లయ్య గూడ గ్రామానికి చెందిన యార నరేష్ 2025 మార్చి 30న ఇంటి నుండి బయటకు వెళ్లి కనిపించకుండా పోయాడు. కుటుంబ సభ్యులు, బంధువులు పలు ప్రాంతాల్లో విస్తృతంగా వెతికినా అతని ఆచూకీ లభించలేదు. దీంతో బాధితుడి కుటుంబ సభ్యులు యాచారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నరేష్ ఆచూకీ తెలిసినవారు లేదా ఎక్కడైనా కనిపిస్తే వెంటనే యాచారం పోలీస్ స్టేషన్‌లో గానీ, లేదా కుటుంబ సభ్యుల ఫోన్ నంబర్లు 9505632050, 9989350705, 9676941560 లలో గానీ సంప్రదించాలని కోరారు. ఆచూకీ తెలిపిన వారికి తగిన పారితోషికం ఇవ్వనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

జాతర భద్రతలో ధారూర్ పోలీసుల పనితీరుకు ఎస్పీ ప్రశంసలు

- పటిష్టమైన బందోబస్తుతో భక్తులకు భరోసా
- సీఐ రఘురాం,ఎస్ఐ సురేష్ పనితీరు భేష్
- పోలీసుల సమన్వయం,ముందస్తు చర్యలపై జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా అభినందనలు



ధారూర్,నవంబర్ 14(జనంసాక్షి) : ధారూర్ మండలంలో జరుగుతున్న 104వ మెథడిస్ట్ క్రిస్టియన్ జాతరలో భక్తుల భద్రతకు పెద్దపీట వేస్తూ పోలీస్ శాఖ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. జాతరకు భారీ సంఖ్యలో తరలివస్తున్న భక్తులు,సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధారూర్ సీఐ రఘురాం, ఎస్ఐ, సురేష్ ఆధ్వర్యంలో పోలీసులు సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారు. జాతర ప్రాంగణంతో పాటు పరిసర ప్రాంతాల్లోనూ నిరంతర నిఘా ఏర్పాటు చేసి శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. శనివారం జాతర ప్రాంగణాన్ని సందర్శించిన వికారాబాద్ జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా ఐపీఎస్ భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ధారూర్ సీఐ రఘురాం,ఎస్ఐ సురేష్ పనితీరును ప్రత్యేకంగా అభినందించారు. జాతరకు భారీగా భక్తులు తరలివస్తున్నప్పటికీ రద్దీ నియంత్రణ,ట్రాఫిక్ క్రమబద్ధీకరణ,భక్తుల భద్రత విషయంలో పోలీసులు చూపిస్తున్న అప్రమత్తత,సమన్వయం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.విధుల పట్ల అంకితభావంతో పనిచేస్తూ జాతరను ప్రశాంత వాతావరణంలో కొనసాగించేందుకు కృషి చేస్తున్న పోలీసు అధికారులను ప్రశంసించారు.జాతర ప్రాంగణం,ప్రధాన ప్రవేశ ద్వారాలు,నిష్క్రమణ మార్గాలు,పార్కింగ్ ప్రాంతాలతో పాటు రద్దీ ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో సీసీటీవీ కెమెరాలు,డ్రోన్ల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేశారు. దొంగతనాలు,జేబుదొంగతనాలు, గొలుసు చోరీలు వంటి ఘటనలు జరగకుండా ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దించారు.మహిళలు,బాలికల భద్రత కోసం షీ టీమ్స్‌ను అందుబాటులో ఉంచారు.ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక బందోబస్తు నిర్వహిస్తూ అంబులెన్సులు,అగ్నిమాపక వాహనాలు వంటి అత్యవసర సేవలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు చేపట్టారు.భక్తుల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ పోలీసు సిబ్బందికి సూచించారు.పోలీసుల సూచనలు పాటిస్తూ జాతర ప్రశాంతంగా జరిగేందుకు భక్తులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ అంజయ్య,డీసీఆర్‌బీ డీఎస్పీ జనయ్య, సీఐ రఘురాం,ధారూర్ ఎస్ఐ సురేష్,సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్ రాయ్,ఎస్ఐ రాఘవేందర్,ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్కతల గ్రామంలోపశువులు, మేకలు త్రాగడానికే

నీళ్లతొట్టిలు కట్టిస్తున్న గ్రామ సర్పంచ్ రేణుక రాములు

నవాబుపేట్ నవంబర్ 14(జనం సాక్షి): మండల పరిధిలోని అర్కతల గ్రామంలో నీళ్ల హౌజులను గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గ్రామంలో ఉన్న పశువుల సమస్యలు మన ముందుగా త్రాగడానికి నీళ్లు కావాలి గ్రామం నాలుగు దిక్కులో హౌసులను నిర్మించాలని గ్రామం ప్రజలు తీసుకున్న నిర్ణయం ప్రకారం గ్రామం పంచాయతీ తీర్మానం చేసిన పశువులు, మేకలు, గొర్లు త్రాగడానికి నీళ్లు లేక ఇబ్బందులకు గురవుతున్న పశువుల కాపరులు నవాబుపేట్ మండల పరిధిలోని అర్కతల గ్రామంలో వేసవికాలం రావడంతో పశువులకు నీళ్లు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న సందర్భంగా పశువుల కాపర్లు గ్రామ సర్పంచి గంగాయి రేణుక రాములుతో మాట్లాడుతూ గ్రామంలో డ్వాక్రా భవనం నిర్మించినారు. సమావేశానికి వచ్చిన మహిళలకు టాయిలెట్ లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న మహిళల కోసం నూతనగా టాయిలెట్ బాత్రూం లు నిర్మించాలని గ్రామ డ్వాక్రా మహిళల సమస్య తీరుతుందని వి బి జి రామ్ పథకం ద్వారా డ్వాక్రా మహిళలకు టాయిలెట్ బాత్రూంలు ఏర్పాటు చేస్తామని సర్పంచ్ రేణుక రాములు పనులు ప్రారంభించారు. పశువులకు నీళ్ల హౌస్ లు నిర్మించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు. గ్రామస్తులు కోరిక మేరకు వి బి జి రామ్ ఆధ్వర్యంలో పశువులు



త్రాగడానికి నీళ్లులకు గ్రామం నాలుగు మూలల పశువులకు మూడు, గొర్రెలు మేకలకు మూడు నీ ళ్లకు హౌస్ లను నిర్మిస్తున్నామంటూ గ్రామం సర్పంచ్ రేణుక రాములు తెలిపారు. వచ్చే రెండు నెలల్లో వేసవి కాలం వస్తున్న సందర్భంగా పశువులకు మేకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నీటిని త్రాగడానికి గతం వారములకు పూర్తి చేస్తామని రేణుక తెలిపారు. గ్రామంలోని ప్రజలందరూ పశువులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేశం కాలంలో గ్రామంలోని బోరుబావి నుండి నీటిని హౌసులకు సప్లై చేస్తూ రోబో ఇలాంటి ఇబ్బందులు కలగకుండా నీటిని అందించే విధంగా చేస్తున్నామని చెప్పండి రేణుక రాములు తెలిపారు.



ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

ఎస్ఏ-1 పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెడల్స్, ప్రశంసాపత్రాలు

కొడంగల్, నవంబర్ 14 (జనంసాక్షి): కొడంగల్ పట్టణంలోని నవీన ఆదర్శ ప్లే అండ్ హైస్కూల్‌లో శనివారం బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భం గా భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాలలపై నెహ్రూకు ఉన్న ప్రేమ, ఆయన జీవిత విశేషాలు, బాలల దినోత్సవ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. అనంతరం ఎస్ఏ-1 పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. విద్యార్థులకు ఉపన్యాస, ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.వి. నరేష్ రాజు, వైస్ ప్రిన్సిపల్ సంతోష, పాఠశాల వ్యవస్థాపకులు డి. లక్ష్మీ వెంకటయ్య పాల్గొని విద్యార్థులకు బాలల దినోత్సవ శు భాకాంక్షలు తెలిపారు.


హయత్‌నగర్ జెడ్పీహెచ్ఎస్‌లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



హయత్‌నగర్, నవంబర్ 14 (జనం సాక్షి) : బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని హయత్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు వివిధ హోదాల్లో అధికారులుగా, ప్రజాప్రతినిధులుగా, ఉపాధ్యాయులుగా బాధ్యతలు స్వీకరించి పాఠశాల నిర్వహణలో చురుకుగా పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయుల పాత్రలను పోషిస్తూ తరగతులను నిర్వహించి, పాఠశాల కార్యకలాపాలను సమర్థవంతంగా కొనసాగించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుతమైన వ్యవహారశైలి, పరిపాలనా నైపుణ్యాలను ప్రదర్శించారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగడానికి దోహదపడతాయని ఉపాధ్యాయులు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి. రమాదేవి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించగా, పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులందరూ పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. బాలల దినోత్సవ వేడుకలు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపాయి.

బాల బాలికల విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

మండల పరిషత్ అభివృద్ధి అధికారి దయానంద్ .. బాలల గ్రామసభ నిర్వహణ



బొంరాస్ పేట, నవంబర్ 14 (జనం సాక్షి): బాల బాలికల విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి దయానంద్ అన్నారు. బాలల దినోత్సవ కార్యక్రమంలో భాగంగా శనివారం బాలల హక్కుల రక్షణ, సంక్షేమంపై ప్రత్యేకంగా బాలల గ్రామసభలు నిర్వహించారు. మండల పరిధిలోని బొట్ల వనితండా గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో సర్పంచ్ బాలు నాయక్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీడీవో దయానంద హాజరై మాట్లాడారు. బాలల సమస్యలను తెలుసుకునేందుకు నిర్వహించిన ప్రత్యేక సభలో విద్యార్థులు పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యతో పాటు,నాణ్యమైన భోజనం వసతి ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివలింగప్ప,వార్డు సభ్యులు శంకర్ నాయక్, అంగన్వాడీ టీచర్లు, ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఓల్డ్ వెంకటేశ్వర నగర్‌లో కమిటీ హాల్‌ను పరిశీలించిన మన్నె గోవర్ధన్ రెడ్డి

ఖైరతాబాద్, నవంబర్ 14 (జనం సాక్షి) : ఖైరతాబాద్ నియోజకవర్గం వెంకటేశ్వర కాలనీ డివిజన్ పరిధిలోని ఓల్డ్ వెంకటేశ్వర నగర్‌లో రూ. 19 లక్షల వ్యయంతో మంజూ రైన నూతన కమిటీ హాల్‌ను ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ మన్నె కవిత గోవర్ధన్ రెడ్డి సందర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చేపట్టిన 'సమస్యలపై సమరం' కార్యక్రమం లో భాగంగా వారు కమిటీ హాల్‌ను పరిశీ లించి, స్థానిక పరిస్థితులను అడిగి తెలుసు కున్నారు. కమిటీ హాల్‌ను ప్రజలకు అందు బాటులో ఉండేలా అభివృద్ధి చేయడంతో పాటు, స్థానికంగా నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామచందర్, రాజు, సారంగపాణి, ఫాషా, అబ్దుల్ మజీద్, ఎండీ ఆఫ్జాల్, రాజమణి, మేరీ, శోభ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల హయత్‌నగర్‌లో మహిళా

- **భద్రతపై అవగాహన కార్యక్రమం, 59వ జాతీయ**
- **గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహణ**



హయత్‌నగర్, నవంబర్ 14 (జనం సాక్షి) : ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హయత్‌నగర్‌లో మహిళా సాధికారత విభాగం, గ్రంథాలయ శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో పలు అవగాహన కార్యక్రమాలు, వేడుకలను ఘనంగా నిర్వహించారు. వనస్థలిపురం డివిజన్ మహిళా భద్రతా విభాగం సహకారంతో మహిళా భద్రత, సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించగా, మరోవైపు 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 137వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళా భద్రతపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాస్, ఏఎస్ఐ జ్యోతి ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులకు మహిళలపై జరుగుతున్న సైబర్ నేరాలు, వాటి నివారణ చర్యలు, వ్యక్తిగత భద్రత, మానవ అక్రమ రవాణాను గుర్తించే విధానాలపై అవగాహన కల్పించారు. టి సేఫ్ యాప్ ద్వారా పొందగలిగే భద్రతా సేవలు, ఆపద సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సురేష్ బాబు మాట్లాడుతూ మహిళలు తమ భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

అనంతరం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సురేష్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని, అకడమిక్ విద్యతో పాటు పోటీ పరీక్షలపై ఆసక్తి పెంపొందించుకోవాలని, పరిశోధనల వైపు దృష్టి సారించి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కళాశాల గ్రంథపాలకులు డాక్టర్ ఎ. ఆనం దం దుర్గాప్రసాద్ మాట్లాడుతూ కళాశాల గ్రంథాలయంలో విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా దినపత్రికలు, మాస పత్రికలు, పరిశోధనా జర్నల్స్, పాఠ్యపుస్తకాలు, రిఫరెన్స్ పుస్తకాలు, పోటీ పరీక్షలు, వివిధ ప్రవేశ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పుస్తక పఠనం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవడంతో పాటు వ్యక్తిత్వ వికాసాన్ని సాధించవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల గ్రంథాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు సందర్శించి వివిధ అంశాలకు సంబంధించిన పుస్తకాలను పరిశీలించారు. విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకొని గ్రంథాలయ వనరులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాలకు ఐసీసీ కన్వీనర్ డాక్టర్ కె. అనిత, మహిళా సాధికారత విభాగం కన్వీనర్ డాక్టర్ అపర్ణ చతుర్వేది సమన్వయం చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ రెడ్డి, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ శేఖర్, డాక్టర్ మక్క, విద్యాసాగర్, డాక్టర్ నరసింహ, డాక్టర్ మహబూబ్, డాక్టర్ రమాదేవి, డాక్టర్ వెంకటలక్ష్మి, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ శారదాదేవి, ప్రొఫెసర్ నాగేంద్ర, బాల మల్లేశం, యాదయ్య, డాక్టర్ ప్రవీణ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జయలక్ష్మి, గ్రంథాలయ సిబ్బంది ఉదయ్ నాయక్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. మహిళా భద్రతపై అవగాహన, పుస్తక పఠనంపై ఆసక్తి – విద్యార్థుల సమగ్ర వికాసమే లక్ష్యంగా కళాశాల కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించబడ్డాయి.

ఎల్లకొండ గ్రామ పంచాయతీలో బాలల స్నేహ పూర్వక గ్రామసభ

- బాల బాలికల భద్రత ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలి
- గ్రామ సర్పంచ్ కావాలి కొండల్ యాదవ్

నవాబుపేట్ నవంబర్ 14 (జనం సాక్షి): ఎల్లకొండ గ్రామంలో గ్రామం పంచాయతీ కార్యాలయంలో శనివారం గ్రామ సర్పంచ్ కావలి కొండల్ యాదవ్ ఆధ్వర్యంలో బాల బాలికల స్నేహపూర్వక గ్రామసభ నిర్వహించిన సందర్భంగా. పాఠశాలలో చదువుతున్న బాల బాలికలపై ప్రతి ఒక్క తల్లిదండ్రులు బాధ్యతలు తీసుకున్నట్లయితే విద్యార్థులు కోరుకున్న లక్ష్యాలు చేరుకోవాలంటే వారికి కావలసిన సదుపాయం తల్లిదండ్రులు బాధ్యత తీసుకొని విద్యకు సరిపడా వస్తువులు అందించినట్లయితే వారు ఎంచుకున్న లక్ష్యాలను చేరుకునే విధంగా ప్రయత్నం చేస్తారని గ్రామ సర్పంచ్ కొండల్ యాదవ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులకు ప్రవేట్ పాఠశాలల కన్నా ప్రభుత్వం పాఠశాలలో విద్యను అభ్యసించే ఉపాధ్యాయులు చదువుకొని మధ్యలో బాధ్యతలు చేసుకుంటూ విద్యార్థులకు విద్యను అందిస్తారని ప్రైవేట్ పాఠశాలల్లో పంపించే విద్యార్థిని విద్యార్థులకు చదువులు రాక తీవ్ర ఇబ్బందులకు గురై 10వ తరగతి లేదా ఇంటర్మీడియట్ చేసి ప్రైవేట్ పాఠశాలలో విద్యను అందిస్తున్న టీచర్లు వల్ల విద్యార్థులు నష్టపోతున్నారని మనమందరం తమతో పాఠశాలలో విద్యార్థులను నిర్మించినట్లయితే వారు అనుకున్న లక్ష్యాలను చేరేవరకు చేస్తారని ఆయన అన్నారు. ఎల్లకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేపత్ర అందిస్తున్న భోజనంలు పురుగులు వస్తున్నాయంటూ విద్యార్థులు పోరున గ్రామసభలు విలపించారు. అన్నం కూడా సరిపోవడం లేదు. పాఠశాలలో ఆడుకోడానికి ఆటవస్తులో లేక తీవ్ర బాల బాలికలు ఇబ్బందులు పడుతున్నారని వాటిని వెంటనే గ్రామస్తులు విద్యార్థిని విద్యార్థులు ఆటవస్తులు అందించాలని విద్యార్థులు పేర్కొన్నారు.



వెళ్లకుండా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు అందరూ వస్తున్నారంటూ గ్రామంలో విద్యార్థులను అడగగా పద్యం అందరూ అందుబాటులోనే ఉంటున్నారంటూ విద్యార్థులకు సమాధానమిచ్చారు. పాఠశాలలో త్రాగడానికి నీళ్లు లేవు, వెంటనే పాఠశాలలకు రావడానికి విద్యార్థులకు నీళ్లు అందిస్తామని సర్పంచ్ తెలిపారు. విద్యార్థిని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని విధాల ఆదుకుంటామని గ్రామ సర్పంచ్ తెలిపారు. గ్రామం పంచాయతి కార్యదర్శి వెంకటయ్య మాట్లాడుతూ. గ్రామంలోని విద్యార్థులు విద్యార్థులు 14 సంవత్సరాల లోపు బాల బాలికలందరినీ బడికి వెళ్లే విధంగా గ్రామస్తులందరూ బాధ్యతగా తీసుకోవాలని ఆయన అన్నారు. బడి బయట ఉన్న బాల బాలికల అందరిని ప్రభుత్వ పాఠశాలల కు పపించే విధంగా గ్రామస్తులంతా వెళ్లి పాఠశాలలో చేర్పించాలని ఆయన తెలిపారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు కొరత ఉన్నందున అందుకే గ్రామంలోని ప్రతి తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలో అందించకుండా ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో గ్రామం పంచాయతీ వార్డు సభ్యులు మాజీ సర్పంచులు మాజీ పిటిసిలు, అంగన్వాడి టీచర్లు ఆశ వర్కర్లు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పిల్లలే దేశానికి భవిష్యత్తు

- విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని దేశానికి పేరు తీసుకురావాలి.
- చదువుతో పాటు మంచి సంస్కారం కూడా ముఖ్యం
- మహాత్మా జ్యోతిబా ఫూలే ప్రిన్సిపాల్ కార్తికేయన్
- చాచా నెహ్రూ జయంతి వేడుకలతో మారుమోగిన ఫులే హాస్టల్
- చిన్నారుల నవ్వులతో నిండిపోయిన బాలల దినోత్సవం

తాండూరు నవంబర్ 14(జనంసాక్షి) : బాలల దినోత్సవం సందర్భంగా మహాత్మా జ్యోతిబా ఫూలే బాలుర వసతి గృహంలో శనివారం సంబరాలు మిన్నంటాయి. చిన్నారుల కేరింతలు, ఉపాధ్యాయుల ఆశీస్సులతో హాస్టల్ ప్రాంగణం అంతా పండుగ వాతావరణం నెలకొంది.ముందుగా ప్రిన్సిపాల్ కార్తికేయన్ ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి భారతదేశ తొలి ప్రధాని, చిన్నారుల ప్రియమైన చాచా పండిట్ జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం విద్యార్థులు తామే ఉపాధ్యాయులుగా మారి అలరించారు. ఒకరు ప్రిన్సిపాల్ గా, మరొకరు టీచర్ గా నటిస్తూ అందరినీ నవ్వుల్లో ముంచెత్తారు. పాటలు, డ్యాన్సులు, కవితలు, నెహ్రూ జీవితంపై ప్రసంగాలతో



చిన్నారులు తమ ప్రతిభను ప్రదర్శించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కార్తికేయన్ మాట్లాడుతూ పిల్లలే దేశానికి భవిష్యత్తు. నెహ్రూ పిల్లలను ఎంతో ప్రేమించేవారు. మీరు క్రమశిక్షణతో చదువుకుని, పెద్దవారై దేశానికి పేరు తీసుకురావాలని సూచించారు. చదువుతో పాటు మంచి సంస్కారం కూడా ముఖ్యంమని విద్యార్థులకు సూచించారు. ఉపాధ్యాయ బృందం మాట్లాడుతూ ఈ రోజు పిల్లలు మాకు గురువులయ్యారు. వారి ఆలోచనలు, వారి ప్రతిభ చూస్తే చాలా సంతోషంగా ఉంది. ప్రతి బిడ్డలో ఒక గొప్ప వ్యక్తి దాగి ఉన్నాడని అన్నారు.విద్యార్థులు మాట్లాడుతూ...చాచా నెహ్రూ అంటే మాకు చాలా ఇష్టం. ఈ రోజు మేము టీచర్లమై చాలా సంతోషంగా ఉంది. బాగా చదివి డాక్టర్, కలెక్టర్ అవుతామని సంబరంగా చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కార్తికేయన్‌తో పాటు ఉపాధ్యాయ బృందం, వార్డెన్, సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



యాచారం మండలంలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు - దివ్యాంగులకు బహుమతుల అందజేత

యాచారం, నవంబర్ 14 (జనం సాక్షి): యాచారం మండలం నైబర్ హుడ్ సెంటర్ ఆధ్వర్యంలో 'సెర్ప్' దివ్యాంగుల సమ్మిళిత అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా బాలల దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా దివ్యాంగులైన పిల్లలకు వివిధ రకాల ఆటల పోటీలను నిర్వహించి, గెలుపొందిన విజేతలకు ఘనంగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీవో రాధా రాణి, వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య, మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు ప్రేమలత, ఏపీఎం రవీందర్, ఎన్‌హెచ్‌సీ సీసీ బాషయ్య హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దివ్యాంగుల సంక్షేమం, వారి సమైక్య అభివృద్ధికి ప్రభుత్వం మరియు సెర్ప్ సంస్థ చేస్తున్న కృషిని కొనియాడారు. పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి క్రీడా పోటీలు ఎంతో దోహదపడతాయని తెలిపారు.

రేపటి జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

రంగారెడ్డి నవంబర్ 14 (జనంసాక్షి): మల్‌రెడ్డి యువశక్తి ఆధ్వర్యంలో ఆదివారం ఇబ్రహీంపట్నంలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాను యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ నెల 15న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇబ్రహీంపట్నంలోని ప్రజాభవన్ (ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం)లో ఉదయం 10 గంటల నుంచి ఈ జాబ్ మేళా ప్రారంభం కానుందని తెలిపారు. ఆదిభట్ల, కొంగరకలాన్ ప్రాంతాల్లోని ప్రముఖ మల్టీనేషనల్ కంపెనీల ప్రతినిధులు పాల్గొననున్నట్లు తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీతో పాటు వివిధ టెక్నికల్ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు ఈ జాబ్‌మేళా ద్వారా ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బాలల దినోత్సవం సందర్భంగా ఇక్షణా స్కూల్ ఆధ్వర్యంలో 2కె రన్



రాజేంద్రనగర్,నవంబర్14(జనంసాక్షి) : మణికొండ అలకాపూర్ టౌన్‌షిప్‌లోని ఇక్షణా స్కూల్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని నవంబర్ 14న యోగా సర్కిల్ వద్ద 2కె రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతర్వ, ఫెడరేషన్ ఆఫ్ ఆల్ కాలనీస్ ఆర్డబ్ల్యూఎ అధ్యక్షుడు అర్వపల్లి వంశీ, తిరుమల హిల్స్ కాలనీ అధ్యక్షుడు డాక్టర్ పి. అవినాష్, అపోలో ఆసుపత్రి సీనియర్ పీడియాట్రిషియన్ డాక్టర్ శర్మిల పెండ్యాల ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారులకు ఆరోగ్యం, క్రమశిక్షణ, మంచి అలవాట్లు, విద్యా విలువలు, క్రీడాస్ఫూర్తిపై సందేశాలు అందించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన రాధిక రవిల్లా, ఇక్షణా స్కూల్ యాజమాన్యాన్ని అతిథులు అభినందించారు.



తాడిపర్తిలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

యాచారం, నవంబర్ 14 (జనం సాక్షి) : యాచారం మండలం తాటిపర్తి గ్రామంలో బాలల దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ నీలం ఝాన్సీ రమేష్ ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బిస్కెట్లు పంపిణీ చేసి, ఘనంగా బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. పిల్లలే దేశానికి అసలైన భవిష్యత్తు అని అన్నారు. విద్యార్థులు చదువులో ఉత్తమ ప్రతిభ కనబరిచి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, తద్వారా గ్రామానికి మరియు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఉత్సాహంగా వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరి, ఉపాధ్యాయులు, గ్రామ కార్యదర్శి శివకుమార్, ఉప సర్పంచ్ ముప్పిడి రమేష్, వార్డు సభ్యులు దార దశరథ, ఆడాల సుశీల తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుల కొరత

విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం!

- వెంటనే అధ్యాపకులను నియమించాలి సామిడి వంశీ వర్ధన్ రెడ్డి

హయత్‌నగర్, నవంబర్ 14 (జనం సాక్షి) : హయత్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుల కొరతతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సామిడి వంశీ వర్ధన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు కళాశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడగా, బోటనీ, ఇంగ్లీష్, తెలుగు వంటి కీలక సబ్జెక్టులకు పూర్తిస్థాయిలో అధ్యాపకులు లేరని విద్యార్థులు తమ సమస్యలను వివరించారని తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్నప్పటికీ కళాశాలలో అధ్యాపకుల కొరతను పరిష్కరించకపోవడం విద్యాశాఖ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే కొన్ని సబ్జెక్టులకు అధ్యాపకులు లేకపోవడంతో విద్యార్థులు పాఠ్యాంశాలను పూర్తిస్థాయిలో నేర్చుకోలేకపోతున్నారని అన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఎలా సిద్ధం కావాలని, వారి భవిష్యత్తుకు బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వ కళాశాలల్లో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఎక్కువగా చదువుతున్నారని, వారికి నాణ్యమైన విద్య అందించడం



ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి బోటనీ, ఇంగ్లీష్, తెలుగు సబ్జెక్టులకు రెగ్యులర్ అధ్యాపకులను నియమించాలని, అప్పటివరకు అర్హులైన గెస్ట్ లెక్చరర్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే నష్టపోయిన బోధనా సమయాన్ని భర్తీ చేసేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహించి పరీక్షలకు ముందే సిలబస్ పూర్తి చేయాలని కోరారు. విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ హయత్‌నగర్ మండల ఉపాధ్యక్షులు ఈ. ఉపేందర్, జాయింట్ సెక్రటరీ జె. భాను ప్రకాష్, నాయకులు సిద్ధు, శివ తదితరులు పాల్గొన్నారు.

మార్కుల కోసం కాదు.. జీవితంలో మార్పు కోసం చదవండి

విద్యార్థులకు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఎన్

తాండూరు నవంబర్ 14(జనంసాక్షి) : సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల తోల్కట్ట నిర్వహించిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భం గా విద్యార్థులకు ప్రత్యేకంగా మోటివేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఎన్. జనార్దన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఆడపిల్లల విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఆడపిల్ల చదువుకుంటే ఒక తరం బాగుపడుతుందని అన్నారు. ప్రతి విద్యార్థి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, డిజిటల్ వనరులను సద్వినియోగం చేసుకుంటూ నిత్యం కొత్త విషయాలను నేర్చుకోవాలని, కాలానుగుణంగా తమను తాము అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. సమాజానికి అవసరమైన మంచి పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు మంచి పాటలతో విద్యార్థులను అలరించారు.ఈ కార్యక్రమంలో సోషల్ వర్కర్, సీనియర్ జర్నలిస్టు, మోటివేషనల్ స్పీకర్ కేవిఎం వెంకట్ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రేరణాత్మక ప్రసంగం చేశారు.

ఆయన మాట్లాడుతూ మార్కుల కోసం కాదు.. జీవితంలో మార్పు కోసం చదవండని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఎన్ని డిగ్రీలు సంపాదించినా వాటితో పాటు నైపుణ్యాలు ఎంతో ముఖ్యమని, నేటి పోటీ ప్రపంచంలో అన్ని రంగాల్లో రాణించాలంటే మానసిక ధైర్యం, ఆత్మవిశ్వాసం, నిరంతర కృషి అవసరమని తెలిపారు.స్వామి వివేకానంద చెప్పినట్లు బలమే జీవనం.. బలహీనతే మరణం అనే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని సూచించారు. నేటి యువత చెడు వ్యసనాలకు, తప్పుడు మార్గాలకు దూరంగా ఉండాలని, అర్ధాంతరంగా జీవితాలను ముగించుకోకుండా సమస్యలను





ధైర్యంగా ఎదుర్కోవాలని అన్నారు.ఈ భూమిపై కేవలం పుట్టి గిట్టిపోవడానికి మాత్రమే మనం రాలేదని, మనం జీవించిన సమాజానికి ఎంతో కొంత మంచి చేసి వెళ్లాలని చెప్పారు. మనుషులు మారాలని, మానవత్వాన్ని పంచాలని, ఇతరులకు సహాయం చేసినప్పుడే నిజమైన మానవత్వానికి అర్థం ఉంటుందని వివరించారు.జీవితంలో ఎప్పటికీ అమ్మానాన్నలను, అత్తమామలను, అక్షరాలు నేర్పిన గురువులను, ఆకలి విలువను, అన్నం విలువను మరచిపోకూడదని హితవు పలికారు. "ఎదగడానికి సమాజం కావాలి.. ఎదిగిన తర్వాత సమాజానికి మీరు కావాలి. సమాజం మీ కోసం ఎదురుచూసే స్థాయికి ఎదగాలి" అని విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను గుర్తు చేశారు.ప్రతి ఒక్కరూ తమను తాము మలుచుకోవాలని, తమ జీవిత లక్ష్యాన్ని తెలుసుకోవాలని సూచిస్తూ.. పుస్తకం ఎల్లప్పుడూ హస్తభూషణంగా ఉండాలని, దేవాలయంలో గడిపే సమయం కంటే గ్రంథాలయంలో ఎక్కువ సమయం గడిపి విజ్ఞానాన్ని సంపాదించాలని పిలుపునిచ్చారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కోట విజయ మాట్లాడుతూ విద్యార్థులకు నిరంతరం నాణ్యమైన విద్యాబోధన అందిస్తూ, వారి భవిష్యత్తుకు సరైన మార్గదర్శనం చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగి సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా మారాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్ర మంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కోట విజయ వైస్ ప్రిన్సిపల్, లైబ్రేరియన్ శిల్పా దేశ్పాండే, ఉపన్యాసకులు, కామర్స్ విభాగండాక్టర్ హలీమున్నీసా,డాక్టర్ మానస,డాక్టర్ అర్పిత,డాక్టర్ నేహా తుంక్,డాక్టర్ అందాలు,కెమిస్ట్రీ విభాగం డాక్టర్ జి. సవితడాక్టర్ జి. నాగలత, వృక్షశాస్త్ర విభాగండాక్టర్ దీపిక, జంతు శాస్త్ర విభాగం, పి. భవాని,గణిత శాస్త్ర విభాగం డాక్టర్ ఎం. మౌనికడాక్టర్ ప్రపూర్ణ,ఆర్థిక శాస్త్ర విభాగం పి. మౌనిక,రాజకీయ శాస్త్ర విభాగం షహానా బేగం,చరిత్ర విభాగం శృతి,గణాంక శాస్త్ర విభాగం పి. మౌనిక,కంప్యూటర్ శాస్త్ర విభాగంశ్వేత,భౌతిక శాస్త్ర విభాగండాక్టర్ స్వాతి,గ్రంథాలయ అధికారి శిల్పా దేశ్‌పాండే,వ్యాయామ విద్యా సంచాలకురాలు రవీనా విద్యార్థులు పాల్గొన్నారు.

పేదల వైద్యానికి భరోసా

- ఆదిబట్ల మున్సిపల్ మాజీ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి
- సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ
- లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేత



రంగారెడ్డి, నవంబర్ 14 (జనంసాక్షి): ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) కొండంత అండగా నిలుస్తోందని టీపీసీసీ సభ్యులు, ఆదిబట్ల మున్సిపల్ మాజీ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి అన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో నియోజకవర్గంలోని పలువురు లబ్ధిదారులకు మంజూరైన మొత్తం రూ.1,39,500 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం మంచాల మండలం ఆంబోత్ తండా, బండలేమూర్ గ్రామాల్లోని లబ్ధిదారుల ఇళ్లకు నేరుగా వెళ్లి అందజేశారు. ఆంబోత్ తండకు చెందిన తార్యకు రూ. 60,000, ఆంబోత్ తండకు చెందిన నేనావత్ కు రూ. 26,000, బండలేమూర్ కు చెందిన పాత్‌లోత్ నేలకు రూ. 53,500 చొప్పున చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్య సమస్యలతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న పేదలకు మెరుగైన వైద్యం అందేలా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. వైద్య ఖర్చుల కోసం ఇబ్బంది పడే నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులతో పాటు, అవసరమైన సందర్భాల్లో ఎల్ఓసీలు కూడా ఇప్పించేందుకు అధికారులతో సమన్వయం చేస్తూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ప్రజల కష్టాల్లో పాలుపంచుకోవడం తన బాధ్యతని, నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాణి శ్రీనివాస్, ఉపసర్పంచ్ సుమన్, నాయకులు సామల రాజేందర్ రెడ్డి, హరి నాయక్, గోపి, లచ్చు, కుమార్, మోహన్ పాల్గొన్నారు.

భక్తజన సందోహం..ఆధ్యాత్మిక వైభవంతో మెథడిస్ట్ జాతర

- ఐదో రోజు అంగరంగ వైభవంగా కొనసాగిన 104వ క్రిస్టియన్ ఉత్సవాలు.
- వెండి,బంగారం,మేకలు,కానుకలుగా సమర్పిస్తున్న భక్తులు.
- చివరి రోజు ఆదివారం ప్రముఖుల రాకకు అవకాశం.భారీగా తరలిరానున్న భక్తజనం.

ధారూర్,నవంబర్ 14(జనంసాక్షి): ధారూర్ మండలంలో జరుగు తున్న 104వ మెథడిస్ట్ క్రిస్టియన్ జాతర ఐదో రోజు శనివారం అంగరంగ వైభవంగా కొనసాగింది.ఎటుచూసినా భక్తజన సందోహం. ఎక్కడ చూసినా ప్రార్థనలు, భక్తిగీతాలు,మొక్కులతో జాతర ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా వేలాదిగా భక్తులు తరలివచ్చి ఏసుక్రీస్తు సిలువ వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తమ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని,అనారోగ్య సమస్య లు తొలగిపోవాలని,కోరుకున్న కోర్కెలు నెరవేరాలని భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు.ఐదు రోజులుగా కొనసాగుతున్న ఉత్సవాలు రోజురోజుకూ భక్తుల రాకతో మరింత కళకళలాడుతున్నాయి.

జాతరకు వచ్చిన భక్తులు సిలువ వద్ద తమ మొక్కులు చెల్లించుకు నేందుకు ప్రత్యేక ఆసక్తి చూపుతున్నారు. కొందరు పొర్లు దండాలు పెడుతూ తమ భక్తిని చాటుకుంటుండగా, మరికొందరు మోకాళ్లపై నడుస్తూ ప్రార్థనలు చేస్తున్నారు.మొక్కులు నెరవేరిన సందర్భంగా వెండి, బంగారు ఆభరణాలతో పాటు మేకలు,కానుకలుగా సమర్పిస్తు న్నారు. భక్తులు సమర్పిస్తున్న కానుకలు, నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రార్థనలతో జాతర ప్రాంగణం భక్తిమయంగా మారింది.కుటుంబ సమేతంగా తరలివస్తున్న భక్తులతో ప్రార్థనా స్థలాలు, ప్రధాన మార్గా లు కిటకిటలాడుతున్నాయి. చిన్నారులు,మహిళలు, వృద్ధులు సైతం పెద్ద సంఖ్యలో పాల్గొంటూ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకుం టున్నారు.ప్రతి ఏటా సంప్రదాయబద్ధంగా నిర్వహించే ఈ మెథడిస్ట్ క్రిస్టియన్ జాతరకు ఈసారి కూడా విశేష స్పందన లభిస్తోంది. శనివారం నాటికి సుమారు ఐదు నుంచి ఆరు లక్షల మంది భక్తులు, సందర్శకులు జాతరను సందర్శించినట్లు అంచనా వేస్తున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న భక్తుల రాకతో జాతర పరిసర ప్రాంతాలు జనసంద్రంగా మారుతున్నాయి.భక్తులు గంటల తరబడి ప్రయాణించి జాతరకు చేరుకుని సిలువ వద్ద ప్రార్థనలు నిర్వహించడం ఈ ఉత్సవాల విశిష్టతకు నిదర్శనంగా నిలుస్తోంది. ఇక ఆదివారం జాతర చివరి రోజు కావడంతో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉంది. పలువురు ప్రముఖులు, క్రైస్తవ మత పెద్దలు,వివిధ ప్రాంతాలకు చెందిన మత పెద్దలు జాతరకు వచ్చే అవకాశం ఉండటంతో చివరి రోజు ఉత్సవాలపై ఆసక్తి నెలకొంది.ఐదు రోజులుగా భక్తుల ప్రార్థనలు, మొక్కులు,కానుకల సమర్పణలతో అంగరంగ వైభవంగా కొనసాగుతున్న 104వ మెథడిస్ట్ క్రిస్టియన్ ఉత్సవాలు ఆదివారంతో ముగియనున్నాయి.భక్తి, విశ్వాసం,సంప్రదాయాల కలయికగా సాగుతున్న ఈ జాతర ధారూర్ ప్రాంతానికి ప్రత్యేక ఆధ్యాత్మిక గుర్తింపును తీసుకొస్తోంది. చివరి రోజు కూడా ఉత్సవాలు అదే భక్తితో ఆదివారం నాడు ముగియనున్నాయి.

16న కలెక్టరేట్‌లో "పిల్లల ప్రజావాణి"



వికారాబాద్ జిల్లా బ్యూరో నవంబర్ 14 (జనం సాక్షి): బాలల హక్కుల వారోత్సవాలను పురస్కరించుకొని ఈనెల 16 (సోమవారం)న కలెక్టరేట్‌లో పిల్లల ప్రజావాణి నిర్వహించనున్నట్లు కలెక్టర్ శ్రీ దీపక్ తివారి ఒక ప్రకటనలో తెలిపారు.బాలల హక్కులపై సమాజంలో అవగాహన పెంపొందించి, వారి సమస్యలపై ప్రతి ఒక్కరిలో బాధ్యతను పెంపొందించేందుకు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాల మేరకు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సహకారంతో సోమవారం కలెక్టరేట్‌లో సాధారణ ప్రజావాణి ప్రాంగణంలోనే పిల్లల కోసం ప్రత్యేక డెస్క్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తద్వారా పిల్లలు తమ విద్య, ఆరోగ్యం, పోషణ, రక్షణ, ప్రాథమిక సౌకర్యాలు, సంక్షేమ పథకాల లబ్ధి తదితర అంశాలకు సంబంధించి నేరుగా తెలియజేసి వినతిపత్రాలు సమర్పించవచ్చని పేర్కొన్నారు.

భాగ్యనగర్‌లో హిందూ వ్యతిరేక కార్యక్రమాలను అడ్డుకోవాలి



రాజేంద్రనగర్,నవంబర్14(జనంసాక్షి) :భాగ్యనగర్ పర్యటనలో భాగంగా మైలార్‌దేవ్‌పల్లికి వచ్చిన బజరంగ్ దళ్ అఖిల భారత కన్వీనర్ కిషన్ ప్రజాపతి బలోపాసన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ప్రేమావతిపేటలోని జిల్లా కో-కన్వీనర్ శ్రీరామ్ నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా భాగ్యనగర్‌లో జరుగుతున్న హిందూ వ్యతిరేక కార్యక్రమాలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రాంత కన్వీనర్ ముఖేష్ యాదవ్, సిటీ కన్వీనర్ అఖిల్, కో-కన్వీనర్ రాహుల్, జిల్లా కన్వీనర్ పవన్, బజరంగ్ దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

చైల్డ్ అబ్యూజ్ వీడియోలు చూస్తే కఠిన చర్యలు

సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసినా కేసులు నమోదు

చిన్నారుల భద్రతకు భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదు : నవాబ్ పేట్ ఎస్సై గిరి

నవాబుపేట్ నవంబర్ 14 (జనం సాక్షి): చైల్డ్ అబ్యూస్ వీడియోలు చూసినా,సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసినా చట్టరీత్యా కఠినచర్యలు తప్పవని నవాబ్ పేట్ ఎస్సై గిరి హెచ్చరించారు.చిన్నారుల భద్రత, గౌరవానికి భంగం కలిగించే వీడియోలను ఎవరూ సృష్టించవద్దని, వీక్షించవద్దని, ఇతరులకు పంపవద్దని సూచించారు.ముఖ్యంగా సామాజిక మాధ్యమాల్లో వచ్చే ఆకర్షణీయమైన లింకులు, వీడియోల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.ఇలాంటి వీడియోలను ఫార్వర్డ్ చేయడం కూడా చట్టపరమైన చిక్కులకు దారితీస్తుందని హెచ్చరించారు.చిన్నారులకు సంబంధించిన అసభ్యకర దృశ్యాలు ఎక్కడైనా కనిపిస్తే వాటిని డౌన్‌లోడ్ చేయకుండా, ఇతరులకు పంపకుండా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ఇంటర్నెట్‌ను బాధ్యతాయుతంగా వినియోగించాలని, సైబర్ నేరాలకు దూరంగా ఉండాలని సూచించారు.ఇలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై గిరి హెచ్చరించారు.